సాక్షి వికారాబాద్

ఆదివారం । 23 । జూన్ । 2024



కరన్‌కోట్ రోడ్డుకు మోక్షం

తాండూరు మండలం కరన్‌కోట్ బీటీ రోడ్డుకు మోక్షం లభించింది. దీంతో రవాణా కష్టాలు తీరనున్నాయి. 8లో▸



మండుతున్న కూరగాయలు

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సామాన్యులు ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. 8లో▸



ఊరూరా ఏరువాక సందడి

ఏరువాక పండుగను రైతులు ఉత్సాహంగా జరుపుకొంటున్నారు. ఎద్దులను ముస్తాబు చేసి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

'జుంటుపల్లి' అభివృద్ధే లక్ష్యం

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



తూము వద్ద మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: మండలంలోని జుంటుపల్లి సాగు నీటి ప్రాజెక్టు అభివృద్ధే తమ లక్ష్యమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. గత వారం ప్రాజెక్టును సందర్శించిన సమయంలో తూము, కాల్వలు, అలుగు దెబ్బతిన్న విషయాన్ని గుర్తించిచారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. శనివారం తూము వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఇరిగేషన్ డీఈఈకి సూచించారు. అనంతరం జుంటుపల్లి రామస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ కమిటీల ఏర్పాటుకు వినతి

మంత్రి కొండా సురేఖను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం నగరంలో కలిశారు. నియోజకవర్గంలోని ఆలయాలకు నూతన కమిటీ ఏర్పాటుకు చేయాలని కోరారు. చైర్మన్, సభ్యుల పేర్లతో కూడిన జాబితాను మంత్రికి అందజేశారు. తాండూరు ప్రాంతంలోని ఆలయాల విశిష్టతను మంత్రికి వివరించారు. త్వరలో ఆలయాలకు కమిటీల ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సేవాలాల్ సేన కోకన్వీనర్‌గా గోవర్ధన్‌నాయక్



కందుకూరు: సేవాలాల్ సేన రాష్ట్ర కో–కన్వీనర్‌గా మండల పరిధిలోని సార్లరావులపల్లికి చెందిన గోవర్ధన్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ శనివారం నియామక పత్రం అందజేశారు. గోవర్ధన్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులకు నిరంతరం పోరాడతానన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన సంజీవ్‌నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కోట్యానాయక్

కడ్తాల్: సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా, కడ్తాల్ మండలం రేఖ్యాతండా పంచాయతీ పరిధిలోని టాక్‌రాజ్‌గూడ తండాకు చెందిన కోట్యానాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఈము రుణాల మాఫీ ప్రకటన హర్షణీయం

ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్: ఈము రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటన చేయడంపై ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి అనుబంధంగా లాభసాటిగా ఉంటుందని ఈము పక్షుల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించి నాబార్డు సహకారంతో సబ్సిడీ ఇచ్చి 15 ఏళ్ల క్రితం బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలను ఇచ్చిందన్నారు. ఆశించిన స్థాయిలో మార్కెట్ లేక రైతులు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని, ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బ్యాంకుల వారు రైతుల ఆస్తులను వేలం వేసిన సంఘటనలు సైతం ఉన్నాయని వివరించారు. ఈము రైతులను ఆదుకోవాలని గతంలో ఎన్నో సార్లు అధికారులను, ప్రభుత్వాన్ని వేడుకున్న ఫలితం లేదని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో రైతులను రుణ విముక్తులను చేసేందుకు మార్గం చూపాలని మంత్రులు అధికారులు ఆదేశించారు. త్వరలో ఈము రైతుల రుణాలను మాఫీ చేస్తామని మంత్రులు ప్రకటించడం హర్షణీయమన్నారు.



కొన్నది సగమే..

వికారాబాద్‌లోని ఓ రైస్ మిల్లులో నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

కొర్రీలతో ధాన్యాన్ని తిప్పి పంపిన మిల్లర్లు

- విధిలేక దళారులకు విక్రయించిన అన్నదాతలు
- జిల్లాలో ముగిసిన వడ్ల కొనుగోళ్లు
- 93వేల ఎకరాల్లో వరి సాగు
- దిగుబడి అంచనా 1.8లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు లక్ష్యం 1.20లక్షల మెట్రిక్ టన్నులు
- సేకరించింది 53,256 మెట్రిక్ టన్నులే

వికారాబాద్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. వరి పంట సాగు చేసిన రైతన్నకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయి. మనకు అన్నం పెట్టే అన్నదాత చెమట కష్టాన్ని దళారులు.. రైసు మిల్లర్లు దోచుకుంటున్నారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల గోల్‌మాల్, అధికారులు, ప్రజా ప్రతినిధులు చేతగానితనం, రైసు మిల్లర్ల అడ్డగోలు దోపిడీతో రైతులు భారీగా నష్టపోయారు. తరుగు, తాలు, తేమ వంటి కుంటి సాకులతో ధాన్యం కొనుగోలు చేయకుండా తిప్పి పంపడంతో విధిలేక రైతులు దళారుల గడప తొక్కి వారు చెప్పిన రేటుకు విక్రయించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. రైసు మిల్లర్లు పెట్టిన నిబంధనలకు తలొగ్గి వారి చేతిలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు కీలుబొమ్మల్లా మారిపోయారు.

నామమాత్రంగా కొనుగోలు

ఎప్పుడూ లేనంతగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో 93వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఒక్కో ఎకరానికి సగటున 15నుంచి 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన జిల్లాలో 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రైవేటుగా విక్రయించింది పోను 1.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిల్లాలో సెర్ప్, పీఏసీఎస్, మార్కెటింగ్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 129 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా కేవలం 53వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసి కేంద్రాలను మూసేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.105.82 కోట్లు జమ చేశారు. మరో రూ.8.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ధాన్యం దళారుల పాలు

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెట్టిన కొర్రీల కారణంగా రైతులు ఈ సీజన్‌లో పండించిన ధాన్యంలో ఎక్కువ శాతం దళారులకే విక్రయించారు. చివరి ధాన్యం గింజ వరకు కొంటాం.. తడిసిన ధాన్యాన్ని సైతం కొంటామని చెప్పిన ప్రభుత్వ పెద్దల మాటలు నీటి మూటలయ్యాయి. సగం ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించారు. ప్రస్తుత సీజన్‌లో సుమారు 1.20లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను దళారులు, వ్యవసాయ మార్కెట్లలో విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర లభించక నష్టపోయారు. ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర ప్రకటించింది. దళారులు, వ్యవసాయ మార్కెట్‌లలో క్వింటాల్‌కు రూ.1,800 నుంచి రూ.1,900లు మాత్రమే చెల్లించారు. దీంతో ఒక్కో క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ. 400 వరకు నష్టపోవాల్సి వచ్చింది. తరుగు, తాలు అంటూ తూకాల్లో సైతం క్వింటాల్‌కు 5 నుంచి 6కిలోల వరకు వడ్లు తగ్గించటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు.

ఓపికతో మాట్లాడండి

- పోలీస్ అధికారులకు ఎస్పీ నారాయణరెడ్డి సూచన



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించి వారితో ఓపికతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ అధికారులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లలో, స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఆత్మహత్యలు తగ్గేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నేరం చేసిన వారికి శిక్ష పడేలా పరిశోధన చేయాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కరుణసాగర్ రెడ్డి, జిల్లా వర్టికల్ ఇన్‌చార్జ్ డీఎస్పీ జానయ్య, ఏఆర్‌డీఎస్పీ వీరేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

పోలీస్ అధికారులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎస్పీ సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. పరేడ్ కమాండర్ ఆర్‌ఐ అంజాత్ పాషా ఎస్పీకి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క పోలీసు అధికారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. నిత్యం వ్యాయామం కోసం సమయం కేటాయించాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సక్రమంగా విధులు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. కుటుంబాన్ని కూడా బాగా చూసుకోవచ్చని తెలిపారు. పోలీసు అధికారులు చురుగ్గా, ఉల్లాసంగా, ఉత్సాహంగా పని చేయాలంటే ఫిట్‌గా ఉండటం చాలా ముఖ్యమన్నారు.

ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపితే కఠిన చర్యలు

- స్కూల్ బస్సుల డ్రైవర్లకు జేటీసీ రమేష్ హెచ్చరిక

సాక్షి, సిటీబ్యూరో: మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడిపినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని రవాణాశాఖ హైదరాబాద్ జేటీసీ రమేష్ స్కూల్ బస్సు డ్రైవర్లను హెచ్చరించారు. పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే, తిరిగి ఇళ్ల వద్దకు చేర్చే వరకు ప్రతి క్షణం ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏలో నిర్వహించిన స్కూల్ బస్ డ్రైవర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు, హెచ్చరికలతో భద్రతా పాఠాలను బోధించారు. రహదారి భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలను నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. బస్సులను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలని, డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బస్సులను నడపాలని చెప్పారు. 'మీ పట్ల ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బస్సెక్కిస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దు. జాగ్రత్తగా బస్సులు నడపండి. చిన్నారులను క్షేమంగా ఇళ్లకు చేర్చండి' అన్నారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది డ్రైవర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులపై ఇటీవల ప్రత్యేక తనిఖీలు చేపట్టిన ఆర్టీఏ అధికారులు తాజాగా డ్రైవర్ల పనితీరుపై దృష్టి సారించారు. ప్రతిబస్సులో అటెండర్ ఉండాలని, పిల్లలు బస్సెక్కే, దిగే సమయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు.



పాతిపెట్టిన మహిళ శవాన్ని బయటకు తీయిస్తున్న పోలీసులు

హత్య చేసి.. పూడ్చిపెట్టి

వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. తనతో పాటు ఇతరులతోనూ చనువుగా ఉంటోందనే అనుమానంతో ప్రియుడే ఆమెను హత్య చేసి, పూడ్చిపెట్టాడు. మూడు నెలల క్రితం అదృశ్యం కేసు నమోదవ్వగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



సంతోష (ఫైల్)

మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- చంపేసి.. పూడ్చి పెట్టిన ప్రియుడు
- మూడు నెలల క్రితం అదృశ్యం.. అస్థిపంజరమై లభ్యం

షాబాద్: అదృశ్యమైన మహిళ.. హత్యకు గురైన సంఘటన షాబాద్ పీఎస్ పరిధిలో వెలుగుచూసింది. మృతురాలి బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన తొంట సంతోష(30) ఏప్రిల్ 7నుంచి కనిపించకుండా పోయింది. ఈ విషయమై ఆమె కుమారుడు సంతోశ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా సదరు మహిళ ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లికి చెందిన సద్దుల సత్తయ్య అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది.

అనుమానంతోనే హత్య

షాబాద్ మండలం బోనగిరిపల్లి సమీపంలో ఉన్న కోల్లబోరాట్ వెంచర్‌లో నిందితుడు సత్తయ్య రెండు నెలల పాటు (మార్చి, ఏప్రిల్) వాచ్‌మన్‌గా పనిచేశాడు. భర్త చనిపోయిన సంతోషతో.. పెళ్లికాని ఇతనికి కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఇటీవల వీరిమధ్య మనస్పర్ధలు రావడంతో సంతోష ప్రియుడిని దూరం పెట్టింది. దీంతో ఆమె ఇతరులతో చనువుగా ఉంటోందని సత్తయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈక్రమంలో సంతోషను అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. మార్చి 28న రాత్రి 8గంటల సమయంలో సత్తయ్య వెంచర్‌లో నైట్ డ్యూటీ చేస్తుండగా మృతురాలు అక్కడకు వెళ్లింది. ఈ సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. నువ్వు ఇతరులతో చనువుగా ఉంటూ నన్ను పట్టించుకోవడం లేదని ఆగ్రహానికి గురైన నిందితుడు ఆమెపై కర్రతో దాడి చేశాడు. తల, శరీర భాగాలపై గాయాలవ్వడంతో కిందపడిపోయింది. దెబ్బలు తాళలేక చనిపోయిందని నిర్ధాంచుకున్న అనంతరం వెంచర్ పక్కనే ఉన్న వరద కాల్వలో గుంత తీసి పాతిపెట్టాడు. మరుసటి రోజు నుంచి అక్కడ డ్యూటీ మానేశాడు.

ఘటనా స్థలంలోనే శవ పంచనామా

నిందితుడు చెప్పిన వివరాల మేరకు అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్, షాబాద్ తహసీల్దార్ అన్వర్ ఆధ్వర్యంలో శనివారం సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఉస్మానియా వైద్యులు శవాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం హతురాలి అస్థిపంజరాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పోలీసులు పట్టించుకోలేదు

నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతురాలి బంధువులు ఆరోపించారు. సంతోష మిస్సింగ్ విషయమై పలుమార్లు స్టేషన్‌కు వెళ్లి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. సత్తయ్యపై తమకు అనుమానం ఉందని చెప్పినా నేడు, రేపు అంటూ కాలయాపన చేశారని వాపోయారు. పోలీసులు వెంటనే స్పందించి ఉంటే కనీసం ఆమె చివరి చూపునైనా చూసుకునేవారమని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు విద్యార్థుల ఎంపిక

- జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్
- అభినందనలు తెలిపిన డీఈఓ రేణుకాదేవి



యశ్వంత్‌గౌడ్ రూపొందించిన ఎగ్జిబిట్





విశాల్ తయారు చేసిన ఎగ్జిబిట్

అనంతగిరి: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. చౌడాపూర్ మండలం మరికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి విశాల్ రూపొందించిన ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇందుకు గైడ్ టీచర్‌గా రవికుమార్ వ్యవహరించారని పేర్కొన్నారు. అలాగే దోమ మండలం దాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి యశ్వంత్‌గౌడ్ తయారు చేసిన పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ ఎంపికైనట్లు చెప్పారు. దీనికి గైడ్ టీచర్‌గా శరత్‌కుమార్ వ్యవహరించారని వెల్లడించారు. జిల్లా నుంచి రెండు ఎగ్జిబిట్స్ జాతీయ పోటీలకు ఎంపికకావడం సంతోషంగా ఉందని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విశాల్, యశ్వంత్‌గౌడ్ పాల్గొంటారని జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు

అందని సహకారం

రైతులకు అందని సబ్సిడీ ఎరువులు, విత్తనాలు

- యంత్ర పరికరాల ఊసేలేదు
- పంట రుణాలు, ధాన్యం కొనుగోలుకే పరిమితమైన పీఏసీఎస్‌లు
- ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు



దౌల్తాబాద్‌లోని సహకార సంఘ కార్యాలయం

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందించే యంత్రాలు, యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాలు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో పేద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం సాగు పనులు ప్రారంభమైనా సబ్సిడీ విత్తనాలు అందడం లేదు. దౌల్తాబాద్ పీఏసీఎస్ పరిధిలో 3వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పంట రుణాలు, ధాన్యం కొనుగోలుకే పీఏసీఎస్ సేవలు పరిమితమయ్యాయి.

బహిరంగ మార్కెట్‌లో..

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే సహకార సంఘాల లక్ష్యం. ఇందులో భాగంగా సాగులో నూతన పద్ధతులను తెలియజేసి, అవసరమైన యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందించే వారు. నాలుగేళ్ల నుంచి సొసైటీలకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరఫరా కావడం లేదు. దీంతో అన్నదాతలు ఫర్టిలైజర్ దుకాణాలు, బహిరంగ మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన కొంత మంది అక్రమార్కులు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. వాటిని విత్తన రైతులు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

శాస్త్రవేత్తల సూచనలేవీ ?

పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే సాగు ఖర్చులే అధికంగా ఉంటున్నాయి. దీంతో రైతులు ఏటా అప్పుల పాలవుతున్నారు. సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. పంట మార్పిడి, సేంద్రియ సాగు, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలపై సూచనలు సలహాలు ఇవ్వాలి. అయితే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. సాగుకు సంబంధించిన యంత్ర పరికరాలు లక్షల్లో ఉంటాయి. వాటిని పేద రైతులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. ఈ సమస్యను గుర్తించిన గత ప్రభుత్వాలు సబ్సిడీపై యంత్రాలను సరఫరా చేసేది. ప్రస్తుతం ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయాలి. గతంలో సహకార సంఘం ద్వారా రాయితీపై కంది, వరి విత్తనాలు అందించే వారు. నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు.

– బసయ్య, రైతు, దౌల్తాబాద్

అధికారులకు నివేదించాం



సబ్సిడీ విత్తనాలు కావాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. రెండు రోజుల్లో కంది, వరి విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

క్లుప్తంగా

అభివృద్ధికి సహకరించండి

జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



ముఖ్యమంత్రిని కలిసిన మేర్గు వెంకటయ్య

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల మండలం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. దుద్యాల్ మండల కేంద్రంలో అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

రేషన్‌బియ్యం స్వాధీనం



నిందితులతో పోలీసులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బురాన్‌పూర్ నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. గ్రామం నుంచి ఆటోలో ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. 17క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు హుజురాబాద్‌కు చెందిన సంపత్, సిద్దిపేటకు చెందిన పోశెట్టిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు.

మొరాయించిన బస్సు



బస్సును తోస్తున్న ప్రయాణికులు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని బస్టాండు ఆవరణలో శనివారం తాండూరు వెళ్లేందుకు మహబూబ్‌నగర్ డిపోకు చెందిన బస్సు ప్రయాణికులను ఎక్కించుకుంది. బస్సు తాండూరు వెళ్లే క్రమంలో కొడంగల్ బస్టాండు ఆవరణలో స్టార్ట్ కాకపోవడంతో కొంత సమయం ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. ప్రయాణికులు కొంతదూరం బస్సును తోయడంతో స్టార్ట్ అయింది. స్టార్టింగ్ ట్రబుల్ ఉన్న బస్సులను డ్రైవర్లు ముందస్తుగానే తెలుసుకునేందుకు ప్రయత్నం చేయాలని ప్రయాణికులు వాపోయారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్ దంపతులు

పరిగి: తిరుమల తిరుపతిలోని వేంకటేశ్వర స్వామిని శనివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో మొక్కులు చెల్లించారు. రాష్ట్రంలో వర్షాలు సంవృద్ధి పడి పాడి పంటలు బాగా పండాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

మూగ జీవాలకు బడ్జెట్ లేనట్లే!

- నట్టల మందులకు నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- ఆరోగ్యకర మాంసం ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం
- జిల్లాలో పదుల సంఖ్యలో జీవాలు మృత్యువాత
- ఆందోళనలో పెంపకందారులు



తాండూరు: వర్షాకాలం ప్రారంభం కావడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రతి ఏటా గొర్రెలు, మేకలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వర్షాకాలం ప్రారంభంలో నట్టల నివారణ శిబిరం నిర్వహించి, మందులు వేస్తు వస్తున్నారు. అయితే, ఈ సీజన్‌లో జీవాలకు సంక్రమించే నట్టల వ్యాధి నివారణకు ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయలేదు. పక్షం రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో గొర్రెలు, మేకలు నట్టల వ్యాధి సోకి మృత్యువాత పడుతుండటంతో గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో 5 లక్షల గొర్రెలు, మేకల పెంపకంతో సుమారు 25 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గొర్రెలు 2.20 లక్షలు ఉండగా, మేకలు 2.80 లక్షల వరకు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే జీవాలు ఆకులు, అలములు తినే సమయంలో తీగ పురుగులు, పేగు పురుగులు, నల్ల పారుడు పురుగులు, కొరడా పురుగులు ఏలిక పాములు, జలగలు లాంటివి ఆశించి వాటి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. దీంతో జీవాల కాలేయం, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, ఇతర అంతర్గత అవయవాల్లో నట్టల స్థావరాన్ని ఏర్పాటు చేసుకొంటాయి. ఇవి గొర్రెల, మేకల్లోని పోషకాలను, రక్తాన్ని హరిస్తాయి. దీంతో జీవాలు రక్తహీనతకు గురై అనారోగ్యం బారిన పడి మృత్యువాత పడుతాయి. అయితే. ఈ సారి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు జీవాలకు నట్టల నివారణ మందులు వేయలేదు. తాండూరు మండలం జీన్‌గుర్తి, ఐనెల్లి, కోట బాస్పల్లి, చంద్రవంచ, చెంగోల్ గ్రామాలతో పాటు యాలాల, బంట్వారం, దౌల్తాబాద్, మండలాల్లో గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి సోకింది. పలు గ్రామాల్లో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయని గొర్రెల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల విడుదలపై స్పష్టత కరువు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యకరమైన మాంసం ఉత్పత్తిపై దృష్టి సారించడం లేదు. గొర్రెల, మేకల పెంపకంతో నాణ్యమైన మాంసం ఉత్పత్తి చేయాలి. అందుకోసం గత ప్రభుత్వం జీవాల ఆరోగ్యం కోసం ప్రతి ఏటా బడ్జెట్ కేటాయించి గొర్రెలకు, మేకలకు సంక్రమించే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. దీంతో జిల్లాలో మాంసం ఉత్పత్తి ఇతర ప్రాంతాలకు రవాణా చేసేలా పెరిగింది. సీజనల్ వ్యాధులు సోకిన గొర్రెల, మేకల మాంసం తింటే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

“ మందులకు నిధులు రాలేదు



వర్షాలు కురిసిన వెంటనే గొర్రెలకు, మేకలకు నట్టల వ్యాధి సోకుతోంది. గతంలో పశువైద్యాధికారులు గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి జీవాలకు మందులు వేయడం జరిగేది. ఈ సీజన్‌లో నట్టల మందులు వేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాలేదు. బడ్జెట్ వచ్చిన వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం.

–డాక్టర్. సదానందం, పశుసంవర్ధకశాఖ అధికారి, వికారాబాద్ జిల్లా

కరన్‌కోట్ రోడ్డుకు మోక్షం

ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: తాండూరు మండలం కరన్‌కోట్ బీటీ రోడ్డుకు మోక్షం లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపనల్‌పల్లి వరకు రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ మట్టి పోసి పనులు నిలిపివేశాడు. దీంతో కరన్‌కోట్ , బెల్కటూర్, చిట్టిఘనాపూర్, ఓగిపూర్, చంద్రవంచ గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తాండూరుకు వెళ్లాంటే గౌతపూర్, ఎల్మకన్నె మీదగా రాకపోకలు సాగించారు. ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డికి కరన్‌కోట్‌కు చెందిన కాంగ్రెస్ శ్రేణులతో పాటు ప్రజలు మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శనివారం కాంట్రాక్టర్ మళ్లీ పనులు పున:ప్రారంభించారు. బీటీ రోడ్డు పూర్తయితే కరన్‌కోట్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి. కార్యక్రమంలో కరన్‌కోట్ ఎంపీటీసీ రాజ్‌కుమార్, నాయకులు సుధాకర్, భరత్‌కుమార్, అనిల్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఉన్నారు.

పింఛన్ పెంపు సాధనకు చలో హైదరాబాద్



మాట్లాడుతున్న జంగయ్య

కాళ్ల జంగయ్య

అనంతగిరి: వికలాంగుల పింఛన్ పెంపు సాధనకు జూన్ 25న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు వీహెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. శనివారం వికారాబాద్‌లో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు, ఆసరా పెన్షన్‌ను 2వేల నుంచి 4వేల పింఛన్ పెంచుతామని చెప్పి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌కు వయస్సు నుంచి వికలాంగుల అందరికీ మినహాయింపు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం మందకృష్ణ మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్, రాష్ట్ర నాయకులు చిట్టిరాజు, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రాజు మల్లయ్య, వెంకటయ్య, సుభాని, శ్రీనివాస్, రమణాచారి, ప్రవీణ్, ఇలియాస్, నాగమణి, హుస్సేన్, లలిత తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయలు



వారాంతపు సంతలో కూరగాయలు

కిలో టామాట రూ.100

మోమిన్‌పేట: మే నెలలో ఎండలు తీవ్రరూపం దాల్చడంతో మార్కెట్‌లో కూరగాయలు మండుతున్నాయి. దిగుబడులు లేక ఏవి కోనాలన్నా కిలో రూ.100కు తగ్గడం లేదు. వేసవిలో నాటేసిన టామాట నారు ఎండలకు ఎండిపోవడంతో టామాట ధర వంద పలుకుతుంది. దీనికి తోడుగా పచ్చిమిర్చి, ఉల్లిధరలు అమాంతం పెరిగాయి. మోమిన్‌పేటలో శనివారం వారాంతపు సంతలో నిత్యం వాడే ఉల్లి, టామాట, పచ్చిమిర్చి ధరలు పెరగడంతో సామాన్యులు కొనుకోలేని పరిస్థితి నెలకొంది. బీర, కాకర, చిక్కుడు, గోరు చిక్కుడు, వంకాయ, దొండకాయ, క్యాబెజీ, కాలీఫ్లవర్, సోరకాయ, ఆకుకూరలు, కోతిమీర, తదితర కూరగాయలు కిలోకు రూ.80కి తగ్గడం లేదని పలువురు పేర్కొంటున్నారు. టామాట, పచ్చిమిర్చి పావు కిలోనే కొనుగోలు చేస్తున్నారని వ్యాపారస్తులు వాపోతున్నారు.



సంతలో జోలె పట్టుకున్న వ్యక్తి

డబ్బులొద్దు.. కూరగాయలు ఇవ్వండి!

బొంరాస్‌పేట: ‘ధర్మం చేయండి బాబూ’.. అంటూ యాచించే యాచకులు వారాంతపు సంతల్లో ‘డబ్బులొద్దూ.. కూరగాయలు ఇవ్వండి’.. ఆదేవుడు చల్లగా దీవిస్తాడూ’.. అంటూ భిక్షాటన చేస్తున్నారు. కూరగాయల ధరలు మండుతున్న కారణంగా యాచకులు సైతం సంతలో కూరగాయలను అడుగుతున్నారు. ప్రతి ఆదివారం మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేట వారాంతపు సంతల్లో ఇలా దర్శనమిస్తున్నారు.

అడ్డురాని పేదరికం

- కూలీ బిడ్డకు జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకు
- అభినందిస్తున్న తండావాసులు



రాహుల్ చౌహాన్

దుద్యాల్ : మారుమూల తండాకు చెందిన గిరిజన బిడ్డ జేఈఈలో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధించాడు. వివరాల ప్రకారం.. దుద్యాల మండలంలోని చెట్టుపల్లి తండాకు చెందిన గోపాల్, శారద దంపతులు గత 6ఏళ్లుగా ముంబాయిలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు రాహుల్ చౌహాన్ జేఈఈ అడ్వాన్స్‌లో 1336 ర్యాంకు సాధించాడు. 10వ తరగతి వరకు మహబుబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్మీడియట్ కొడంగల్ గిరిజన గురుకుల కళాశాలలో చదివాడు. అక్కడ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వింటూ జేఈఈకి ప్రిపేర్ అయ్యాడు. జేఈఈ మెయిన్స్‌లో 60శాతం మార్కులు సాధించాడు. మంచి ర్యాంకు రాదని భావించి, జేఈఈ అడ్వాన్స్ పరీక్ష రాసి మంచి ర్యాంకు సాధించాడు. ఇటీవలే జరిగిన కౌన్సిలింగ్‌లో చత్తీస్‌ఘడ్‌లోని ఐఐటీలో సీటు సాధించాడు. తల్లిదండ్రులు దగ్గర లేకున్న హాస్టల్‌లో ఉండి చదువుకుంటూ ఘనత సాధించడంపై తండావాసులు అభినందిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



కృష్ణయ్య (ఫైల్)

కుల్కచర్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన రేణి కృష్ణయ్య(35), ఆటోడ్రైవర్. కాగా శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన కృష్ణయ్య తిరిగి రాలేదు.. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం తెలిసిన వారి దగ్గర వెతకగా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో శనివారం కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



న్యాయమూర్తిని కలిసిన నారాయణరెడ్డి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె.నారాయణరెడ్డి శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డికి పూలబొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

బెల్ట్ షాపులపై దాడులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులు, బార్లపై హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. బంజారాహిల్స్, బోరబండ, చిక్కడపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తర లించారు. వీరి నుంచి రూ.1.06 లక్షల విలువైన 48 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్‌లో చిట్లూరి శ్రీనివాస్, బోరబండకు చెందిన వీ నర్సింహా, రామాంతపూర్‌కు చెందిన మల్లేష్‌లు స్థానిక వైన్స్‌లలో మద్యాన్ని కొనుగోలు చేసి, అర్ధరాత్రి సమయంలో ఎక్కువ ధరకు మద్యాన్ని విక్రయిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పాంబండ క్షేత్ర గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ఉన్న పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో శనివారం గిరిప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో పాంబండ క్షేత్రం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు మొక్కుకున్నారు. గిరిప్రదక్షిణ చేస్తున్న క్రమంలో భారీవర్షం కురిసినా భక్తులు గిరిప్రదక్షిణను వర్షంలోనే కొనసాగించారు.



వర్షంలోనూ గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

6 కేసులు నమోదు.. బెల్లం పానకం ధ్వంసం

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్‌పోలీసు స్టేషన్ పరిధిలోని తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని పలు గ్రామాలు, గిరిజన తండాల్లో శనివారం ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరు కేసులను నమోదు చేసి పలుచోట్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. తలకొండపల్లి మండలం తుమ్మలకుంటతండా, హర్యానాయక్‌తండా, లక్ష్మీతండా, చీపునుంతల, చుక్కాపూర్, కడ్తాల మండలం సలార్‌పూర్‌తండాల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. తలకొండపల్లి మండలంలో నాలుగు కేసులు, కడ్తాల మండలంలో రెండు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ స్వప్న, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ దశరథ్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు

నాటుసారాను తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ హెచ్చరించారు. తలకొండపల్లి మండలంలోని పలు తండాలు, గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ప్రభుత్వం నాటుసారాపై ఉక్కుపాదం మోపిందని, సారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. నల్లబెల్లం, పటిక, నవసాగరం తదితర నాటుసారా తయారీకి వినియోగించే వాటిని విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. నాటుసారా తయారు చేసినట్లు తెలిస్తే ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటా

- జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్
- తల్లిదండ్రులు లేని బాలికకు స్కూల్‌లో ప్రవేశం



చిట్టితో జెడ్పీటీసీ వెంకటేశ్, తదితరులు

తలకొండపల్లి: తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చదివించి వారు ఉన్నత చదువులు చదివేంత వరకు ఖర్చులను భరిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని పాతకోట తండాకు చెందిన చిట్టి తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో చిట్టి తాత సంరక్షణలో 5వ తరగతి వరకు చదివింది. వయస్సు పైబడడంతో చిట్టిని ఆమె తాత చదివించలేకపోతున్నారు. తండావాసులు ఈ విషయాన్ని జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన చిట్టిని కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజ్ఞ స్కూల్ యజమాన్యంతో మాట్లాడి శనివారం చిట్టిని 6వ తరగతిలో చేర్పించారు.

బ్యాగుల కలకలం



రోడ్డు పక్కన పడేసిన బ్యాగులు

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన కత్తరించిన బ్యాగులు కలకలం రేపాయి. మండలంలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఖాళీస్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు టూరిజం బ్యాగులు కత్తరించి పడేశారు. శనివారం స్థానికులు, రోడ్డు వెంట వెళ్లేవారు వాటిని చూసి, ఎందుకు పడేశారు..? ఎక్కడి నుంచి తెచ్చారు..? అనే సందేహం నెలకొంది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత



పుల్లప్పగూడలో పట్టుబడిన రేషన్ బియ్యం

కొందుర్గు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన శనివారం మండలంలోని పుల్లప్పగూడలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజుశివకుమార్ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం కొందుర్గు పోలీసులు రాజు ఇంట్లో సోదా చేశారు. దాదాపు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై రాజును విచారణ కోరగా గ్రామాల్లో రేషన్‌కార్డుల లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు విక్రయిస్తుంటామని చెప్పారు. ఇందులో భాగంగానే బియ్యం నిల్వ ఉంచినట్లు వివరించారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యంతో పాటు నిందితుడు రాజును పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య పేర్కొన్నారు.

పాఠశాల గోడ దూకబోయి..

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యార్థికి తీవ్రగాయాలు



గాయపడిన విద్యార్థి

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల గోడ దూకేందుకు యత్నించిన విద్యార్థి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రగాయాల పాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని మేధా ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉంటున్న అక్రం తన కుమారుడు ఆర్మాన్(9)ను కొన్ని రోజుల క్రితం పట్టణంలోని మేధా ఇంటర్నేషనల్ పాఠశాలలో 5వ తరగతిలో చేర్పించాడు. అక్కడే పాఠశాల ఆవరణలో హాస్టల్ ఉంటూ అక్కడే చదువుకుంటున్నాడు. ఎప్పటిలాగే తరగతికి వెళ్లిన ఆర్మాన్ మధ్యాహ్నం సమయంలో వాష్ రూంకని చెప్పి హాస్టల్ వైపు వెళ్లాడు. హాస్టల్ వెనుక నుంచి గోడ దూకేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గోడ పక్కనే ఉన్న రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యానికి తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులు పాఠశాలకు చేరుకొని బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

పాఠశాల యాజామాన్యం నిర్లక్ష్యంతోనే..

విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని, ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతోనే విద్యార్థి ప్రమాదానికి గురయ్యాడని ఆరోపించారు. పాఠశాల సమయంలో విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎందుకు వెళ్తున్నారనే విషయాన్ని ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి ఆర్మాన్ ప్రమాదం బారిన పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.